ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
20 మే
2025





# మే 31 న టీజేఎఫ్ రజతోత్సవాలు: అల్లం నారాయణ

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షులు అల్లం నారాయణ చెప్పారు. 2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని అల్లం నారాయణ తెలిపారు. వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ, సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత జర్నలిస్ట్ ఫోరందని అల్లం నారాయణ అన్నారు. ఉద్యమం చల్లబడ్డప్పు అల్లా టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని ముందుకు నడిపింది అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలను సమాజానికి మ-రోసారి తెలియజెప్పడానికి హైదరాబాద్ నెక్లె స్ రోడ్డు లోని జలవిహార్ లో ఈ నెల 31న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని టీజే ఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ అన్నారు. మే 31న జలవిహార్ లో నిర్వహించే టీజే ఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లం నారాయణ, చంటి క్రాంతి కిరణ్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, ఎ. రమణ కుమార్, పి.శశికాంత్, ఎం.వి.రమణ, కోశాధికారి పి.యోగానంద్, జాయింట్ సెక్రటరి యార నవీన్ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, టీయూ డబ్ల్యూ జే హైదరాబాద్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రాకేష్ రెడ్డి, సోమేశ్వర్, కోశాధికారి బాబు రావు, కళ్యాణ్ చక్రవర్తి, చిన్న పత్రికల సంగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఆగస్టీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నారసింహుడికి బంగారు ఆభరణాలు విరాళం

### రూ.17 లక్షల హారం, రూ.13 లక్షల వడ్డానాలు సమర్పణ





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఓ దంపతులు రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను సోమవారం విరాళంగా అందజేశారు. వరంగల్ కు చెందిన ఆకుల అనిల్ కుమార్, హైమావతి దంపతులు రూ.17 లక్షల విలువ గల బంగారు హారం, రూ.13 లక్షల విలువైన రెండు బంగారు వడ్డానాలను స్వామివారికి విరాళంగా సమర్పించారు. మొదట ఈ బంగారు ఆభరణాలను ప్రధానాలయ ముఖ మంటపంలో ఉన్న లక్ష్మీనారసింహుల ఉత్సవమూర్తులకు పాదాల చెంత పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు ఆభరణాలను ఆలయ డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ చేతుల మీదుగా దాతలు ఆలయానికి అందజేశారు. అనంతరం దాతలు ప్రధానాలయంలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దాతలకు వేదాశీర్వచనం చేయగా.. డీఈవో భాస్కర్ శర్మ లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఆలయ ప్రధానార్చకులు కాందూరి వెంకటాచార్యులు, ఏఈవో నవీన్, సూపరింటెండెంట్ రాజన్ బాబు తదితరులు ఉన్నారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనుబంధ ఆలయమైన శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి(స్పటిక లింగం)కి రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా సోమవారం ఆలయానికి రూ.33,97,335 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# దేవస్థాన గోశాలకు రెండు ట్రాక్టర్ల ఎండుగడ్డి



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో నిర్వహింపబడుతున్న గోశాలకు ఓ భక్తుడు రెండు ట్రాక్టర్ల ఎండుగడ్డి పశుగ్రాసాన్ని అందజేశారు. తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి సోమవారం దేవస్థాన గోశాలలోని గోవులకు రెండు ట్రాక్టర్ల ఎండుగడ్డి పశుగ్రాసాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోవులకు పశుగ్రాసం ఇచ్చే అవకాశాన్ని కల్పించిన ఆలయ అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


# ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి



యాదగిరిగుట్ట(మోటకొండూర్), రోమింగ్ న్యూస్: బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన మోటకొండూర్ మండలం కాటేపల్లిలో సోమవారం జరిగింది. మోటకొండూర్ ఎస్ఐ నాగుల ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పట్ల పద్మ(50) భర్త పట్ల నరసింహతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భర్తతో కలిసి ఆమె ట్రాక్టర్ పై కూలీపనికి వెళ్లింది. ట్రాక్టర్ లోని గ్రానైట్ రాళ్లను ఖాళీ చేసి తిరిగి వస్తుండగా.. కాటేపల్లి బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు కింద గుంతలో బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజిన్ పై ఉన్న పట్ల పద్మ(50) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ ఉపేందర్ యాదవ్ తెలిపారు. మృతురాలి కుమారుడు పట్ల మత్స్యగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేందర్ యాదవ్ వెల్లడించారు.

# ఆపదలో ఉన్నోళ్లకు సీఎంఆర్ఎఫ్ ఆపన్నహస్తం

### - ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ప్రమాదవశాత్తు అనారోగ్యంతో హాస్పిటల్ లో అడ్మిటై బిల్లు కట్టలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తంగా మారిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో లబ్ధిదారులకు సోమవారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ అనేది ఒకప్పుడు పలుకుబడి, పైరవీలు, రాజకీయ నాయకుల పరిచయాలే ఉన్న కుటుంబాలకే సీఎంఆర్ఎఫ్ ఫలాలు అందేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మారుమూల ప్రాంతాల సామాన్య పేదప్రజలకు కూడా చేరుతున్నాయని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో ఆలేరు నియోజకవర్గం రాష్ట్రంలో రెండో ప్లేస్ లో నిలిచిందన్నారు. సీఎంఆర్ఎఫ్ వల్ల పేదప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యం అంది సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వస్తున్నారని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ను పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ తదితరులు ఉన్నారు.

# శ్రీవారికి అఖండాల విరాళం

**తిరుమల,మే 19 :** తిరుమల శ్రీవారికి శతాబ్దాల అనంతరం అఖండాలను మైసూరు రాజమాత ప్రమోదా దేవి విరాళంగా అందజేశారు. రంగనాయకుల మండపంలో రెండు భారీ వెండి అఖండ దీపాలను సోమవారం అందించారు. ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు- చరిత్రలో ఉంది. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుంది. టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాక్ పర్యటన

### ఐఎస్ఐ ఆహ్వానం ఉందన్న సిఎం బిశ్వ శర్మ

**గౌహతి,మే 19 :** పాకిస్తాన్ ఇంటె-లిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాకిస్తాన్‌లో పర్యటించారని, ఐఎస్ఐతో సన్నిహితంగా వ్యవహరించారని అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిస్వ శర్మ చేసిన సంచలన ఆరోపణలు వ్యవహారం మరింత ముదురుతోంది. తాజాగా తన వాదనను హిమంత్ బిస్వ శర్మ మరింత బలంగా వినిపించారు. తాను చెప్పింది తప్పని తేలితే సీఎం పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.

# వెంకటయ్యకు కీలక పదవిస్తాం : హరీష్‌రావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఆలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రజా సమస్యలపై ఎనలేని పోరాటం చేస్తున్న యాదగిరిగుట్ట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కర్రె వెంకటయ్యకు జిల్లా స్థాయిలో అత్యంత కీలక పదవి అప్పగిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు హామీ ఇచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సోమవారం ఆయన హైదరాబాద్ లోని హరీష్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలేరు నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఆగడాలు, ఆలేరు ఎమ్మెల్యే తీరును ఎప్పటికప్పుడు ఎండగడుతూ కర్రె వెంకటయ్య చేస్తున్న పోరాటం హర్షనీయమని కొనియాడారు. అధికార పార్టీ బెదిరింపులకు భయపడకుండా ఇకపై కూడా అదేరకమైన పోరాటాన్ని కొనసాగించాలని, రాష్ట్ర పార్టీ తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 17 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయిందని, ఈ అవకాశాన్ని బీఆర్ఎస్ కు అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక సీట్లు గెలుచుకునేలా క్యాడర్ పనిచేయాలన్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసే ప్రతొక్కరికీ పార్టీ పదవులు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అయిలయ్య, బీసీ విభాగం మండల అధ్యక్షుడు మహేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు బాబురావు గౌడ్ తదితరులు ఉన్నారు.

